# అవిశ్రాంత సేవకు లభించిన అరుదైన గౌరవం

## 7 హిల్స్ రెసిడెన్సీ అధ్యక్షుడిగా కత్తుల రాంబాబు మరోసారి ఏకగ్రీవం

**హైదరాబాద్/మన్సూరాబాద్, జూన్30 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మనసురాబాద్ డివిజన్ పరిధిలోని ప్రముఖ నివాస ప్రాంతమైన 'సెవెన్ హిల్స్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్'నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసింది. కాలనీ సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ అందరి మన్ననలు పొందిన సీనియర్ నాయకులు కత్తుల రాంబాబు అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఆయనతో పాటు నూతన కార్యవర్గ సభ్యులుగా సెక్రెటరీగా కిషోర్ బాబు, జాయింట్ సెక్రెటరీగా బోగోజు మధు,ట్రెజరర్‌గా శేఖర్ గౌడ్, అలాగే ఉపాధ్యక్షులుగా వెంకటేష్ ప్రవీణ్ సాయి కృష్ణ కార్యవర్గ సభ్యులుగా సరస్వతి స్రవంతి రమేష్, అజయ్ సతీష్,వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, అంటే 2007వ సంవత్సరం నుండి నేటి వరకు వరుసగా 19 సంవత్సరాలుగా కత్తుల రాంబాబుపై కాలనీవాసులు తమ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వస్తున్నారు. ఈ సందర్భంగా పునరేకగ్రీవమైన నూతన అధ్యక్షుడు కత్తుల రాంబాబు మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకంతో గత 19 సంవత్సరాలుగా ప్రతిసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న కాలనీ నాయకులకు, సభ్యులకు, మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల విజయోత్సవ మరియు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కాలనీ ముఖ్య నేతలు, సభ్యులైన రామ్మోహన్,శోభన్, రాంప్రసాద్, సైదులు కార్తీక్ తదితరులతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి ఘనంగా శు భాకాంక్షలు తెలిపారు. 19 ఏళ్లుగా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతున్న నాయకుడు. ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన విద్యార్థి ప్రధాన కార్యదర్శి గుండ గాని మధు



గౌడ్, సెవెన్ హిల్స్ కాలనీ అధ్యక్షుడుగా మరోసారి ఎన్నికైన కత్తుల రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ,కాలనీకి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తూ నిరంతరం ప్రజల నోట్లో నాలుకలా మెదులుతూ.. 19 ఏళ్లుగా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతున్న నాయకుడని కొనియాడారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

## డ్రగ్స్ అలవాటు వ్యక్తి, కుటుంబం, సమాజ భవిష్యత్తుకు ముప్పు

నేటి సమాజంలో యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సమస్యల్లో మాదకద్రవ్యాల (డ్రగ్స్) వినియోగం ప్రధానంగా మారింది. ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన ఈ సమస్య ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, చిన్నారులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ మాఫియా తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ శాఖ "డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ" లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువస్తోంది. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, వాల్ పోస్టర్లు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపడుతోంది. డ్రగ్స్ అలవాటు వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాన్ని, సమాజాన్ని, దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వ్యక్తులు శారీరక, మానసిక సమస్యలకు గురికావడంతో పాటు నేరాలకు పాల్పడే అవకాశాలు పెరుగుతాయి. విద్యార్థుల చదువులు దెబ్బతిని, యువత తమ లక్ష్యాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పోలీసులు పేర్కొంటున్నారు. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు కలిసి అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టి అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. కేవలం శిక్షలతో కాకుండా అవగాహన, కౌన్సెలింగ్, సామాజిక సహకారంతోనే ఈ సమస్యను నిర్మూలించవచ్చని ధికారులు అభిప్రాయపడుతున్నారు.యువతను క్రీడలు, విద్య, ఉపాధి, సామాజిక సేవల వైపు మళ్లించడం ద్వారా మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి అవును చెప్పండి" అనే సందేశంతో యువతలో చైతన్యం పెరుగుతోంది. డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి కుటుంబం, ప్రతి విద్యాసంస్థ, ప్రతి గ్రామం, ప్రతి పౌరుడి బాధ్యత. సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే మాదకద్రవ్యాల రహిత తెలంగాణ సాధ్యమవుతుంది.

వ్యాసకర్త
గంపల శివకుమార్

